కథ:

# మగువ మనసు

"నేననుకున్నట్లే అయింది" అన్నాడు మూకుడుగా రూంలోకి అడుగెడుతూ—

"ఏం జరిగిందేమిటి?" చదువుతున్న పత్రికను టేబిల్ మీద కి గిరాటు కొడుతూ అడిగాడు రావు.

"ఇది అందరు విచారించవలసిన విషయం. గ్రేట్ ట్రాజడీ - మన మురళి గాడూ లేడూ?" అంటూ కుర్చీలో కూలబడ్డాడు శర్మ —

"లేకే, వున్నాడు. చెప్పరా సస్పెన్సులో పెట్టి చంపక" ముఖం చిట్లిస్తూ అన్నాడు రావు.

"మీనాక్షి వాడ్ని ప్రేమించదట."

"చంపేశావ్ - ఇంతేకదా!... అయినా ప్రేమంటే బొత్తిగా లోకువై పోయింది. దానికి ఎంత విలువ వుందో తెలుసుకోకుండా ఎలాపడితే అలా అవరించడమేనాకి మంచి శాస్తే జరిగింది.. ఇంతకీ ఆ మోడరన్ గరల్ ఎవరు?"

"ఆమె గురించి చెప్పడం చాలా కష్టంరా - ఒక అందాల బరిణె. సౌందర్యమంతా తనలో దాచుకొన్న అపరంజిబొమ్మ - నిజంగా నువ్వే గనక చూస్తే నిలబెట్టి వర్ణించడంఖాయం".

"అలాగా — అయితే, ఆ వరూధిని ప్రేమించకపోతే మన ప్రవరాఖ్యుడేం చేస్తానంటున్నాడు?" అనడిగి పెద్దగా నవ్వాడు రావు.

ప్రేమించకపోతే మననిట్టూర్చి "పాపం అన్నం తినడంమాని చచ్చిపోతాడట" అన్నాడు.

'ఇంకే, వారి ప్రణయగాథ సువర్ణాక్షరాలతో లిఖించుగాక! అరేబియాలో మజ్నూ తన ప్రియురాలు లైలా కోసం ప్రాణాలు పోగొట్టుకుంటే, ఆంధ్రదేశంలో మురళి మీనాక్షికోసం జీవితాన్నే అర్పిస్తాడన్నమాట?"

"జోక్ కాదురావ్! మనం వాడికి ఏదో సలహా యివ్వకపోతే అన్నంతపని చేస్తాడు"

"తప్పకుండా యిద్దాం—సాయంత్రం మురళిని కనుక్కుంటే అన్ని విషయాలు తేలిపోతాయ్ — అదిసరే, నాకు తెలియకడుగుతాను, వీడు ప్రేమాయణంలోపడి చదువుకి స్వస్తి చెబుతున్నాడా?" అంటూ ప్రశ్నార్థకంగా శర్మ మొహంలోకి చూశాడు రావు.

"పోన్లేరా, వాడికి చదువెందుకు — కావలసినంత ఆస్తి వుంది ... యికలే కాలేజీ టైం అయింది, పోదాంపద" అని పుస్తకాలు తీసుకోవడానికి లేచాడు శర్మ.

ఇక్కడ శర్మ రావుల గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. యిద్దరు బి. ఎ. మొదటి సంవత్సరం చదువుతున్నారు. పెద్ద ఆస్తిపరులు కాకపోయినా ఏదో లోటులేని సంసారాల్లో జన్మించడంవల్ల వేషభాషలకేం కొదువలేదు— సంవత్సరం నుంచి యిద్దరు ఎంతో స్నేహంగా కలిసి మెలసి ఒకేరూంలో వుంటున్నారు— కాని, వారివి విభిన్నమనస్తత్వాలు, ఒకరిభావాలు ఒకరికి అతకవు- శర్మ మంచిడిటెక్టివ్, ఏదైనా పరిశోధన చేయడమంటే మహాయిష్టం - ప్రతీదాన్ని నిశితంగా పరీక్షిస్తేగాని వదిలిపెట్టడు— 'గోడమీద చీమ ఎందుకు వెళుతుంది? దానికేదో కారణముండాలి' అంటాడు - కొత్తగా కాలేజీ చేరినప్పుడు ఒక అబ్బాయి ఒక అమ్మాయి ప్రేమగొడవలో పరిశోధన ప్రారంభించి బాగా చివాట్లు తిని బయటికొచ్చాడు—

రచన:
బండారు వెంకటేశ్వరరావు

రెండో అతను రావు సాహిత్య ప్రియుడు - మంచికవి — ప్రతిరోజు కాలేజీ వదలగానే ఏ చెరువు గట్టుకో వెళ్ళి నింగిని చూస్తూ ఏవో మధురభావాలను వూహించుకొని, వాటిని కాగితం మీద పెడతాడు. అతనికథలు తరచు పత్రికల్లో పడుతుండేవి. అంచేత రావుకి కొంతపేరు ప్రతిష్ట ఏర్పడింది —

ఇక అసలుకథా నాయకుడు మురళికి ఆ యిద్దరు మిత్రులంటే ఎంతో అభిమానం.

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకి మురళి మిత్రుల రూంకివచ్చాడు—

గదిలోకి ప్రవేశిస్తూనే అడిగాడు మురళి—

"శర్మా! నే చెప్పింది ఏం చేశావు?"

"రావుతో చెప్పాను - మరేమాలోచించాడో!" అన్నాడు శర్మ.

"మీనాక్షి గురించేనా?" ప్రశ్నించాడు రావు.

"అవున్రా. ఆమె నాకు ప్రాణంతో సమానం. గాఢంగా ప్రేమించేశాను - ఆమె లేకపోతే ఈభువిలో ఒక్కక్షణం బ్రతకలేను —ఏమాఅందం-ఏమివయ్యారం- అబ్బ! ఆడవాళ్ళలో అందకత్తెలెవరని పోటీపెడితే "మిస్ ఆంధ్రా" అనే బిరుదు తప్పక మీనాక్షికే వచ్చి తీరుతుంది" అన్నాడు మురళి.

"మీనాక్షి అంత బ్యూటీగా వుంటుందా? అసలు ఆమె నీకు ఎలా తటస్థపడింది?" అడిగాడు శర్మ—

"వారం రోజుల క్రితం నేను రెండో ఆట సినిమాకెళ్ళాను. పిక్చర్ ఆరోజే రిలీజ్ కావడంచేత హాలుబయట జనం కిటకిట లాడుతున్నారు. టికెట్ దొరకడం దుర్లభంగావుంది. నాకేం తోచక ఒకచోట నిలుచుని జనాన్ని చూడసాగాను.

ఇంతలో ఓ యువతి కంగారుగా నాదగ్గరకొచ్చి పెద్ద చనువున్నదానిలా "మిస్టర్! నాకో చైర్ టికెట్ తెచ్చిస్తారా?" అనడిగింది.

ఆమె ఎవరో నాకు తెలియక బాగా పరకాయించి చూశాను - వయస్సు 20 సంవత్సరాల లోపలవుంటుంది. మనిషి ఎర్రగా బక్కపలచగావుంది. జార్జెట్ సిల్కుచీర, నీలిరంగువాయిల్ జాకెట్టు, కాళ్ళకు స్లిప్పర్సు ధరించింది. మెళ్ళో రాళ్ళ నెక్లెస్‌వుంది. తల్లో మల్లెపూలు తురుముకొంది—.

"జనం చాలా రద్దీగా వున్నారండీ" అన్నాడు కాస్త సిగ్గుతో.

"జనం ఎక్కువ వస్తేకదా మిమ్మల్ని తెమ్మనికోరింది" అంటూ హేండ్‌బ్యాగ్ లోంచి డబ్బుతీసింది.

నిజం చెప్పొద్దూ, ఆ మనిషిని చూస్తుంటే నాకు 'లేదు' అనడానికి నోరు రాలేదు- ప్రయత్నిస్తానంటూ గబగబ జనంలోకి వెళ్ళిపోయాను.

పావుగంట గడిచింది. ఎలాగో రెండు టిక్కెట్లు సంపాదించాను - రూంనుంచి బయలుదేరినప్పుడు ఎంత అందంగా తయారయ్యానో, అప్పుడు అంత అసహ్యంగాను వున్నాను. బట్టలు చమటికి తడిసి పోయాయి. జుట్టు బాగా రేగిపోయింది. ముఖమంతా జిడ్డుగా తయారైంది, జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటూ ఆమెకు టికెట్ యిచ్చాను.

"మిమ్మల్ని చాలా శ్రమ పెట్టాను సుమండీ" అంది నావాలకం గమనించి.

"శ్రమపడకుండా ఫలితం ఎలా లభిస్తుంది? క్లైమాక్సు జయించిన హీరోలా పోజు పెట్టి అన్నాను.

ఆమె చిన్నగా నవ్వి వూరుకుంది.

"ఆఁ-రండి లోపలి కెళదాం" అన్నాను.

యిద్దరం కలసి హాల్లోకి వెళ్ళాం.

"మీ ప్రక్కన నేను కూర్చోవచ్చా?" అడిగింది ఆమె.

నేను కాస్సేపు తటపటాయించి "ఫర్వాలేదు - కూర్చోండి" అన్నాను.

అప్పటికింకా ఆట ప్రారంభంకా లేదు.

"మీ పేరేమిటో చెప్పారు కాదే!" అన్నాను.

"మీనాక్షి - చాలా మంచి పేరు కదూ?" ట్యూబ్ లైటువంక చూస్తూ అంది ఆమె.

"బ్యూటీఫుల్ నేమ్ — యిప్పుడు ఎక్కడ వుంటున్నారు?"

"మీరుంటోన్న గదికి నాలుగిళ్ళవతల - మరి మీరేం చేస్తుంటారు?"

"చదువు కొంటున్నాను"

"ఒంటరిగానే వుంటున్నారా?"

"ఔను - నాకింకా పెళ్ళి కాలేదు"

"సుఖపడ్డారు-లేక పోతే ఈనాడు నా ఈ స్థానం మీ శ్రీమతి ఆక్రమించి వుండేది" అంది నవ్వుతూ మీనాక్షి.

ఆకొద్ది పరిచయంతోనే ఆమె నాకు సన్నిహితురాలై పోయింది. అసలే స్త్రీకి స్వాతంత్ర్యం యివ్వాలని సాధించేవారిలో ప్రథముణ్ని. అంచేత మీనాక్షి నడత నాకు బాగా నచ్చింది.

సినిమా వదిలేక యిద్దరం కలసి ఒకే రిక్షామీద యింటికి బయలుదేరాం—

దారిలో ఒకచోట రిక్షా కుదుపుకి మీనాక్షి నామీదకు ఒరిగి అదోలా చూసి నవ్వింది. ఆచూపే శాశ్వతంగా నాహృదయంలో నిలిచిపోయింది.

రిక్షా మీనాక్షి యింటిముందు ఆగింది.

ఆమె రిక్షాదిగి "వీలుంటే రేపొకసారి మాయింటికి 'టీ'కి రావాలి" అంది.

'అలాగే వస్తాన'న్నాను—

ఆపొద్దుట అందంగా ముస్తాబై ఆమె యింటికెళ్ళాను—నన్ను చూసి ఆమెఎంత ఆనందించిందో చెప్పడం కష్టం - గబగబ లోపలికెళ్ళి టీ టిఫిన్ తీసుకొచ్చి నాముందు పెట్టింది. నేను వద్దని బెట్టుచేసినా, ఆఖరికి తినక తప్పింది కాదు—టీ త్రాగుతూ "యీ యింట్లో మీరుతప్ప యింకెవరు లేరా?" అని అడిగాను.

"అమ్మా నాన్నా మొన్ననే [illegible] గుంటూరు వెళ్ళారు. యింకా నెల రోజుల్లో రావొచ్చు" అంది మీనాక్షి.

ఆమాట వినేసరికి నాకు ఎగిరిగంతేయాలన్నంత సంతోషమైంది.

"అంతవరకు ఒంటరిగానే వుంటారా?" అన్నాను.

"భయం దేనికి? ఎవరు ఎత్తుకు పోతారండీ"

"ఎంతవరకు చదువుకున్నారు?"

"ఎందుకలా అడుగుతున్నారు?"

"వూరికే తెలుసుకుందామని"

"స్కూల్ ఫైనల్ ప్యాసయ్యాను. మేమిక్కడికి రాకముందు విశాఖపట్నంలో మహిళామండలికి కార్యదర్శిగా పనిచేశాను."

'వెరీగ్రాం! అన్ని విధాలనాకు తగినవారు మీరే"

"అంటే అర్థం?"

"మిమ్మల్ని నేను ప్రేమించాను. మీరే నాసర్వస్వం"

"చూడండి మిస్టర్! మీరు పైకి లేపారా?" అంది కోపంగా చూస్తూ మీనాక్షి.

"ఎందుకు?" అంటూ కుర్చీలోంచి పైకి లేచాను.

"ఆడది ఒంటరిగా కనబడితే మీ యిష్టమొచ్చినట్లు మాట్లాడతారా? యింకెప్పుడు యిటువంటి చెడుబుద్ధులతో యిక్కడికి రాకండి" అందిక సరికొడుతూ—

నేను చేసేదిలేక తెల్లమొహం వేసుకొని రూంలో పడ్డాను... ఓగే ఫ్రెండ్స్! మీరే నాకు దిక్కురా—మీనాక్షి నెలాగైనా నాదానిగా చేసుకోవాలి – ఏదో ఒక సలహాయిచ్చి పుణ్యం కట్టుకోండిరా బాబూ?" అంటూ తనకథను ముగించాడు మురళి.

"వండర్ ఫుల్ స్టోరీ – మొత్తంమీద మీనాక్షిని నువ్వు వదలనంటావ్?" అడిగాడురావు.

"ఆమెను నాహృదయ ఫలకం నుంచి తప్పించలేనురా" అన్నాడు మురళి.

"అయితే మీనాక్షినీకు దక్కాలంటే, ఆమె మనస్సు కరిగేలా ఓ ప్రేమలేఖ రాయి" అన్నాడు శర్మ.

మురళికి శర్మ సలహా రుచించలేదు.

"ఒరే రావ్! నువ్వు కవివి – ఏదో అయిడియా చెప్పాలిరా" అన్నాడు.

రావు సిగరెట్టు వెలిగించి, దమ్ము గట్టిగాపీల్చి "భలే అయిడియా దొరికింది" అన్నాడు.

"ఏమిటది?" అంటూ మురళి ఆత్రంగా రావు మొహంవంక చూశాడు.

"ప్రేమలేఖ రాసేకంటే, మరో సారి మీనాక్షి దగ్గరకెళ్లి ఆమె మనసు కరిగేలా ప్రాధేయపడి అడిగితే బావుంటుంది" అన్నాడురావు.

మురళి ఓక్షణంపాటు ఆలోచించి "సరే వెళతాను – ఈదెబ్బతో అన్ని గొడవలు తేలిపోతాయి" అంటూ మిత్రులదగ్గర శెలవు తీసుకొని బయటికెళ్లిపోయాడు.

రెండు రోజులు గడిచాయి.

మురళి మీనాక్షితో మాట్లాడటానికి వెళ్ళాడు. ఆమె అతన్ని ఆప్యాయంగా ఆదరించింది.

"ఏమండీ, మొన్న నేను అలాగన్నానని కోపమొచ్చిందా?" అనడిగింది గోముగా.

మురళి ఏంసమాధానం చెప్పలేదు –

మీనాక్షి బిగింపుగా నవ్వి వూరుకుంది—

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి—

"మీనా! నిన్ను చూస్తుంటే నాకు భలే నవ్వొస్తోంది" అన్నాడు మురళి.

"ఎందుచేత?" కళ్లు త్రిప్పుతూఅంది మీనాక్షి.

"నిన్ను అర్థంచేసుకోవడం కష్టంకాబట్టి—"

"నిజంగానా?"

"ఔనుమీనా! నీవు చాలా మంచిదానివి"

"పొగడ్తలకేంగాని, మనపెళ్లిమాట యదార్థమేనా?"

"సూర్యచంద్రులు గతులు తప్పినే తప్పవచ్చునేమోగాని, నేను మాత్రం అన్నమాట తప్పను"

"ఏమోలెండి—పురుషుల్ని నమ్మమని ఎక్కడుంది? మళ్ళీ ఏ అందమైన అమ్మాయో కనిపిస్తే, ఆమె నేవలచానని పట్టుపట్టి కూర్చుంటారు"

"మీనాక్షి కంటే అందమైనఅమ్మాయి ప్రపంచంలో మరొకరుండరు."

"వేళాకోళం చేస్తున్నారా?"

"లేదుమీనా! ఏదిఏమైనా నువ్వే నా అర్థాంగివి"

"అదిసరే అనుకోండి – మరి అమ్మానాన్నా మనపెళ్ళికి యిష్టపడాలిగా!"

"మనం పెళ్లాడతామంటే అడ్డుపెట్టడానికి వాళ్లెవరు?"

"నా శ్రేయస్సు కోరేవారు"

"నాకంటేనా? చూడు మీనా! అమ్మానాన్నా నిన్ను పెంచి పెద్దజేసి పెళ్లి చేసే వరకే—ఆతర్వాత భర్తే స్త్రీకి దైవం-తెలుసా?"

"అయినా. పెద్దవారిమాట తీసుకొనిగాని, ఏదీ చెప్పలేను"

"నీయిష్టం-నాలాంటిసుగుణవంతుడు కోరుతుంటే మీనాన్నమాత్రం కాదంటారా?"

"ఏమనేదిపదిరోజుల్లో తెలిసిపోతుందిగా – అదిసరే, ఈ ఉంగరం ఎక్కడకొన్నారు' అంటూ అతని వ్రేలినున్న ఉంగరాన్ని చూపుతూ అడిగింది మీనాక్షి.

"బావుందికదూ? న్యూమాడల్ – హైదరాబాదులో కొన్నాను"

"మంచి అందంగావుంది – ఈసారి మీరు హైదరాబాదు వెళితే నాకోటి తెచ్చిస్తారా—డబ్బిచ్చేస్తాను"

"నీకంత సరదాగావుంటే కొద్దిరోజులు పెట్టుకో" అని వ్రేలి వుంగరాన్ని తీసి ఆమెకివ్వబోయాడు మురళి—

"వద్దులెండి – కొద్ది రోజులే ముచ్చట తీరుతుందా? తర్వాత తెచ్చిపెట్టండి" అంది మీనాక్షి—

"అయితే కలకాలం పెట్టుకో – నేను వద్దన్నానా? మనప్రేమకు బహుమానంగా యిస్తున్నాను" అంటూ ఆమె వ్రేలికి వుంగరాన్ని తొడిగాడుమురళి.

"మీలాంటి ఉదార స్వభావులు యింకోనలుగురుంటే దేశంలో బీద

వాళ్లికే స్థానమేవుండదు" అంది ఆనందంగా మీనాక్షి.

"యిక నే వెళతాను - కాలేజీకి టైం అయింది" అంటూ లేచాడు మురళి.

"మళ్ళీ సెలవు రోజున రండి— సర్దాగా కాలం గడుపుదాం" అంది మీనాక్షి-

మురళి ఆమె దగ్గర్నించి రూంకొచ్చేశాడు-

తిరిగి మురళి మీనాక్షిని నాలుగు రోజులగ్గాని చూడలేకపోయాడు—

ఆరోజు కాలేజీకి శెలవు. మధ్యాహ్నం ఫోంచేసి ఆమెదగ్గరకెళ్ళాడు- సాయంత్రందాకా యిద్దరు కబుర్లతో కాలం గడిపారు.

"మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను" అంది మీనాక్షి.

"దాయడం ఎందుకు? అడుగు" అన్నాడు మురళి.

'ఓ రెండువందలు అర్జంటుగా యిస్తారా? మళ్ళీ వారంరోజుల్లో సర్దేస్తాను"

"రెండువందలా?" అన్నాడు ఆశ్చర్యంలో.

"ఔనండి - బాధలవే!" తనలో తాను గొణుక్కుంది మీనాక్షి.

"బాధేమిటి?" విచిత్రంగా చూస్తూ అడిగాడు మురళి.

"నాలుగునెలల క్రితం మానాన్న బట్టలకొట్టులో చీరలు అరువు తెచ్చాడట—షావుకారు డబ్బిస్తావా, చస్తావా అంటూ పీకలమీదకొచ్చి కూర్చున్నాడు; ఆడదాన్ని నేనేంచేయగలను చెప్పండి?' అంది.

"నాదగ్గర యిప్పుడు డబ్బులేదు మీనా! మానాన్నను పంపమని ఉత్తరం రాయాలి."

"రాస్తే ఎప్పుడు అందుతుంది?"

"నాలుగురోజులు పట్టొచ్చు"

"అంతవరకు షావుకారు ఆగేలా లేడు."

"మరి ఏం చెయ్యమంటావ్?"

"స్నేహితుల్ని అడిగి తీసుకోండి."

"వద్దులే— నేనే యింటికి వెళతాను- షావుకారు వస్తే రేపు డబ్బు ముఖాన్న కొట్టేస్తానని చెప్పు."

"మిమ్మల్ని ఎంతో శ్రమ పెడుతున్నాను."

"ఏ శ్రమపడ్డా నీకోసమే గా మీనా?"

ఆమాటకు మీనాక్షి తనలో తానే నవ్వుకొని. "చీకటి పడుతోందిరూం కెళ్ళరూ?" అంది.

"అప్పుడే వెళ్ళిపొమ్మంటావా?"

"పెళ్ళికాకుండా మనం యిలా..." ఏదో అనబోయి ఆగిందిమీనాక్షి.

"అదీ ఒక మాటే..." అంటూ లేచి గదిలోంచి బయటికొచ్చాడు మురళి-

ఆ మరుచటిరోజు ప్రొద్దుటబండికే యింటికెళ్ళి సాయంత్రానికల్లా డబ్బు తెచ్చి మీనాక్షి చేతిలోపోశాడు మురళి-

"ఆపదలో కాపాడినందుకు మీకు ధన్యవాదాలు" అంది మీనాక్షి -

మురళి ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. ఆమె అలా అనడమే అతనికెంతో [illegible]దాయకమైంది.

రాత్రికి మిత్రుల్ని కలుసుకొని తన చరిత్రంతా వారికి వినిపించాడు.

"బావుందిరా నీవరస-ఆమె మోజులో పడి డబ్బుకూడా తగలేస్తున్నావా? నీ బుద్ధులేం నాకు నచ్చలేదు" అంటూ మందలించాడు డిటెక్టివ్ శర్మ-

"ఇంతకీ మీనాక్షి మనవాడ్ని నిజంగా ప్రేమిస్తుందా? నాకేదో అనుమానంగా వుంది?" అన్నాడు రావు - వారి మాటలేం లెక్కచేసుకోలేదు మురళి.

వారంరోజులు గిర్రున తిరిగాయి -

ఒకనాటిరాత్రి ఏడుగంటలకి మురళి మీనాక్షికోసం వెళ్ళాడు—ఆమెఇంట్లో లేదు - వీధితలుపుకి తాళం పెట్టి వుంది- ఒక్కసారిగా నిర్ఘాంతపోయి పక్కింటి వార్ని అడిగాడు.

"ఈ ఊరునుంచి వెళ్ళిపోయింది బాబూ!" అన్నారు.

మురళి గతుక్కుమన్నాడు — నోట మాట రాలేదు—బుర్ర తిరుగుతున్నట్లయింది—'ఎంత మోసం' అప్రయత్నంగా ఆమాట నోటినుంచి వెలువడింది.

కాస్సేపు అలాగే నిలుచుండి, తర్వాత తేరుకొని మిత్రుల రూంకి వచ్చాడు.

"నీ గాథ ఓ సినిమాకు యివ్వు మురళీ! థ్రిల్లింగ్, సస్పెన్స్ వున్నాయి కాబట్టి హిట్ అవడానికి అవకాశముంది" అని గట్టిగా నవ్వేశాడు రావు.

"పోయినామె జాడ తెలుసుకుంటే మనడబ్బు మనకొస్తుందేమో!" అన్నాడు శర్మ.

"ఆడవారి చేతిలో చిక్కిన సొమ్ము తిరిగంటూ రావడం కుద్దకల్ల" అన్నాడు రావు.

మురళి ఏంమాట్లాడలేదు — ఒక్కసారిగా అతని కళ్ళనుండి నీళ్ళు గిర్రున తిరిగాయి.

అతని పరిస్థితి చూసేసరికి శర్మకు జాలివేసింది -

"విచారించకు వెర్రినాయనా! వెళ్ళిపోయిన మీనాక్షి తిరిగిరాదుగాని, పోగొట్టుకున్న ఉంగరం, డబ్బు తిరిగి

వచ్చాయి' అని చెబుతోంది కొన్ని నోట్లను పైకి తీస్తూ తర్వ—

మురళి స్తంభించి పోయాడు. ఏమిటి గమ్మత్తుగా వున్నాడు -

"అవి ఎలా వచ్చాయి శర్మా?" అని అడిగాడు.

"ఎలావస్తాయి — మీనాక్షి తెచ్చి యిచ్చింది"

"మీనాక్షా?" అన్నాడు తెల్లబోయి చూస్తూ మురళి.

"పాపం నీకోసం మధ్యాహ్నం వచ్చి చూసి చూసి మరీ వెళ్ళింది"

"ఆమెదీవూరు కాదా?"

"కాదు - ఏదో వూళ్లో పంతులమ్మ పనిచేస్తూందట — ఏదో కోర్టు వ్యవహారాలకోసం యిక్కడికొస్తే ఆమెకు నీవు తటస్థపడ్డావట - నీలాంటి వ్యక్తుల్ని చూస్తే ఆమెకు బలేసర్దా - తమాషా చేసి ఏడిపించాలని బుద్ధిపుట్టి అలా సంచరించింది తప్ప, నీమీద ఏమాత్రం ప్రేమలేదట—ఆ సంగతి నీకు చెప్పాలనే వచ్చింది. కాని నీవు కాలేజినుండి రాలేదు—డబ్బు, ఉంగరం మా చేతి కిచ్చి నీకిమ్మని చెప్పి వెళ్ళిపోయింది - పైగా, నీకేదో ఉత్తరం కూడా యిచ్చింది" అన్నాడు శర్మ.

శాస్త్రుడాయి సాగసులొంది కవరుతీసి మురళి చదివాడు.

మురళి ఆత్రంగా చదువుతాడు -


"మురళిగారు!


జీవితంలో మానవులు పెంచుకొనే ఆశలకు ఓ పరిమితంటూ లేకపోతే, వారుకట్టుకునే సౌధాలన్నీ ఒక్కసారిగా నేలకూలడం ఖాయం. మీరు నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నాకోసం ఏత్యాగమైనా చేయడానికి సిద్ధంగా వున్నారు - కాని మీ ప్రేమ తృణీకరం - మిమ్మల్ని పూర్తిగా అర్థంచేసుకున్నాను, అందుకే కాలేజీలో మీరంటే నాకు ఆదోవిధమైన జాలి- ఎన్నోవిధాల మీదరికి రావాలని ప్రయత్నించాను మనస్సు అంగీకరించలేదు. కాబట్టి మిమ్మల్ని నేను ప్రేమించలేను — యిలా రాస్తున్నందుకు మన్నించండి. అయితే నాకో బాధమాత్రం వుంది- భవిష్యత్తులో మీరు ఎంతో వృద్ధిలోకి రావలసివుంది - చదువుకొనే రోజుల్లో ఎందుకొచ్చిన ప్రేమ గొడవలు దేనికి? చదువు ధ్యాస మీకుంది అమ్మాయిని చూసు కొని పెళ్ళాడండి—అదే నాకోరిక - ఇట్లు—

మీనాక్షి"

ఆ ఉత్తరం చదివే సరికి మురళికి కోపం ముంచుకొచ్చింది. ఉత్తరంలో కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపి పారేశాడు. తర్వాత కొంతసేపటికి సంభాళించుకొని—

"మీనాక్షిలాంటి స్త్రీలు లోకంలో అరుదుగా వుంటారు శర్మా! యిందులో ఒకర్ని అనవలసిన పనిలేదు. తప్పంతా నాదే — ఆమె అంతర్యాన్ని అర్థంచేసుకోలేక నాలో స్వార్థమై పోయింది— కాని నిర్ధంగా నాకు ఆమె దక్కని శాపం తొలగించి వెళ్ళింది" అంటూ ఉంగరాన్ని వ్రేలికి పెట్టుకొన్నాడు మురళి—







*